# ★ లేడీస్ క్లబ్ ★

* శ్రీమతి మల్లవరపు విజయలక్ష్మిగారు *

"ఏం, రాధా! ఇవ్వాళ క్లబ్బుకు పోలేదా! రోజూ రాత్రి యెనిమిదింటికి యింటికి వచ్చే వాడిని కనుక నాకు యేమీ తెలిసేది కాదు. నీవు రోజూ క్లబ్బుకు పోతున్నావనే అనుకుంటున్నా! ఏం! ఎందుకు పోలేదూ? నీకు వంట్లో బాగా లేదా? అబ్బాయేడీ?" అని యేకధాటీగా ముకుందరావుగారు యింటికి రాగానే భార్యమీద ప్రశ్నలు కురిపించారు.

"ఏం? మీరు యివ్వాళ అయిదింటికే ఆఫీసునుంచి వచ్చేశారేం?" అని అడిగి, జవాబు కెదురు చూడకుండానే, 'అబ్బాయిని పక్కయింటివారి అమ్మాయి యెత్తుకు తీసికెళ్ళింది. వాళ్ళకి వాడంటే యెంతో ముద్దు సుమా! అమ్మాయిని పని పిల్ల అట్లా తోపుడు బండీలో తీసికెళ్ళింది" అంది రాధ.

"ఇవ్వాళ మా ఆఫీసు నాలుగింటికే అయిపోయింది. ఆగకుండా యింటికే వచ్చేశాను. వెధవాఫీసు యెక్కడో దూరంగా జార్జిటౌనులో వుందాయెను. మామూలుగా అయిదున్నరకు ఆఫీసు అయిపోయినా గాని, ఏదో కొంత సేపు నలుగురం కలిసి బాతాఖానీ కొడతాం. అటు తర్వాత ట్రాంస్టాండుకు వచ్చి, అక్కడ పడిగాపులు పడుండి పడుండి కాళ్ళు పీక్కొస్తాయి. రాధా నీకు అనుభవంలేదు గానీ, యీ రోజుల్లో సాయంత్రమూ పొద్దున్నా ట్రామూ బస్సూ దొరకడం యెంత కష్టమో నీకు తెలుసా! అందుకే ఆఫీసు వదలి రోజూ ఆరింటికి బయలు దేరితే యిల్లుచేరుకునే సరికి యెనిమిది అవుతోంది. దానికేంగాని నువ్వు క్లబ్బుకి యివ్వాళ వక్కరోజే వెళ్ళలేదా, లేక రోజూ వెళ్ళడం లేదా? నీవు యింతా చేరి పదిహేను రోజులేగా అయింది" అంటూ సమాధానానికి ఆగకుండానే, "మన యిద్దరం పిల్లలను తీసుకొని యెక్కడికేనా వెడదామా? పని రోజుల్లో యెక్కడికి వెళ్ళేందుకే అవకాశం వుండదూ! పోనీ యివ్వాళ సినిమాకు దేనికైనా పోదామా! ఏమిటి?"

"ఎల్లుండి "స్వర్గసీమ" రిలీజట. చూసిన వాళ్ళు చాలా బాగుందని చెప్పేరు. ఇవ్వాళ బీచికి వెడదాము లెండి."

శాంథోము బీచిలో రాధాముకుందులు పిల్లలతో సరదాగా కబుర్లు చెప్పుకుంటుండగా రాధ అంది కదా "ఎందుకండీ క్లబ్బుకెళ్ళడం? నా కోసం ఖర్చు పెట్టే డబ్బు దండుగ తప్ప, మరేమీ ప్రయోజన మున్నట్టు కనపడదు. ఇవ్వాళేయేం! అప్పుడే వారం రోజులనుంచీ మానేశాను. నాలాంటి వారికి అల్లాటి అర్హతవుండదని నాకు యిప్పుడే కాదు, యిదివరకునుంచే తెలుసు. మీరు సరదా పడుతున్నారు కదా! అని చేరాను. క్లబ్బులో చేరి నలుగురిలాగా మసిలేందుకు నాకేమి క్వాలిఫికేషన్లు వున్నాయి? నగలా? అసలు లేవు! పోనీ పట్టు చీరెలా? అంతకంటే లేవు! పోనీ! భర్తా పెద్ద ఉద్యోగంలో లేరు. మరి దేన్ని బట్టి నన్ను గౌరవిస్తారూ" అని కళ్ళ నీళ్ళు పెట్టుకుని, "పోనిద్దురూ! ఏదో మీరన్ని సార్లు నొక్కినొక్కి అడిగారని చేప్పేను గాని, లేకపోతే ఆ విషయం యెత్తేందుకే నా కిష్టం లేదు" అంది.

పాపం, ముకుందరావు అంతావిని నిస్పృహతో ఒక్క నిట్టూర్పు విడిచి వూరుకున్నాడు.

ముకుందరావు ఉత్తమ కుటుంబానికి చెందినవాడు. ఆ కుటుంబంలో అందరూ మొగ ఆడా భేదము లేకుండా దేశం కోసం పాటుపడి జైళ్ళకు వెళ్ళివచ్చిన వాళ్ళే! ఉన్న ఆస్తిపాస్తులు కరిగి పోయాయి. కరిగి పోవా? ఆర్జన అనేది లేకుండా దేశం కోసం ఖర్చు పెడితే? ఇతను కూడా రెండు మూడు సార్లు జైలుకు వెళ్ళి వచ్చినవాడే మూమెంటు రోజుల్లో. ఆ రోజుల్లో కష్టసుఖాలు యేమీ తెలిసేవి కావు. మంచి విద్యావంతుడు. మనస్ఫూర్తిగా రాధను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఆ అమ్మాయి స్కూలుఫైనల్ పరీక్ష ప్యాసయింది. ముకుందరావు ఉన్నత ఆశయాలు కలవాడు కనుక భార్య స్వేచ్ఛకు యేమాత్రం అడ్డువచ్చే వాడు కాదు.

పెళ్లయిన వెంటనే రాధ కడుపు ఫలించి యిద్దరు పిల్లలు పుట్టారు. ముకుందరావు యెంత స్వతంత్ర జీవైనా, పరిస్థితులు యెదురు తిరిగి నప్పుడు ఎవరేమి చేయగలరు? మన దేశంలో, ఆత్మ గౌరవానికీ, స్వతంత్ర జీవితానికీ, తావుంది కనకనా! అట్టి వుద్దేశాలు వున్నవాడు మలమలా మాడి చావాలిసిందే! బాగుపడాలంటే ఉచ్ఛ స్థితిలో నున్న నలుగురి దగ్గరికీ వెళ్లి, చేతులు నులిపి ప్రాధేయపడి మంచి చేసుకోవాలి. అప్పటికీ వాళ్ల కటాక్షం కలుగుతుందని చెప్పలేము. అసలు ఆపై వుద్యోగస్తులుకూడా ఒకానొకప్పుడు వాళ్ల పైవాళ్ల కాళ్లట్టుకుని చచ్చి శాయింగల విన్నపాలు చేసి, ఆత్మ గౌరవం అమ్ముకుని సంపాదించుకున్న వుద్యోగాలవి. అల్లాంటి వాళ్లు తమ కష్టాన్ని మరిచి పోతారా! తాము తమ కంటే తక్కువవాళ్ల చేత అంత కంటే యెక్కువగా కాళ్లు పట్టించుకోవాలి. లేక పోతే తమ గొప్ప తనానికి భంగం రాదూ! మరి!

ఇన్ని నాళ్లు జీవితం ఏకపధాన ఇంకొకళ్లకి లొంగకుండా గడిచింది. కాని వివాహమై పిల్లలు కలిగాక ఆ విధంగా స్వతంత్ర జీవయాత్ర చేసేందుకు వీలుందా? మన బానిస దేశంలో? స్నేహితుల సలహామీద ముకుందరావు ఆఖ్రే తన స్వతంత్ర జీవితానికి అడ్డురానటువంటి ఉద్యోగంలో నెలకు డెబ్భైరూపాయల వేతనం మీద మద్రాసులో చేరాడు.

తాను కుటుంబ పోషణానికి పగలు పది గంటలకు యిన్ని మెతుకులు తిని బయలుదేరి పోతే రాత్రి యెనిమిది గంటలకాయె యింటికొచ్చేది. ఈలోపుగా, పాపం రాధ ఒకర్తీ యింట్లో ఏం తోస్తుంది? అందులో మనవేపైతే యిళ్లుకొంచెం పెద్దవిగా పెరడూ గట్రా వుంటాయేరి ఇక్కడేముంది! ఒక రొస్తే లోపలికి ఇద్దరు అవతలికి నడవాలి. ఆ రెండు గదుల్లో ఎంత సేపని కాలక్షేపం చేస్తుంది. అందులో చాలా చురుకైన పిల్ల. ఇంటి పని పిల్లలపని ఇట్టే సమర్థించుకుంటుంది. భర్తలాగే తనకీ కూడా ఉన్నతమైన ఉద్దేశాలున్నాయి. అస్తమానం వంటింట్లోనే పడి చావాలనే రకం కాదు. చిన్నప్పుడు తాను స్కూల్లో చదువుకునే రోజుల్లో బాట్‌మింటన్, టెన్నిస్ బాగా ఆడేది. ఆ స్కూల్లో ప్రయిజులన్నీ తనవే. ఒక సంవత్సరం ఆలిండియా వుమన్సు టోర్నమెంట్సులో, టెన్నిసులోనూ, బాట్‌మింటన్‌లోనూ, సింగుల్సులోనూ, డబుల్సులోనూ, కూడా ప్రథమురాలుగా వచ్చి ఎన్నో వెండి కప్పులు బహుమతి పొందింది. అంచేత కాకినాడలో ఆ అమ్మాయి పేరు చెప్పితే "ఓహో ఆ అమ్మాయా! టెన్నిసు ప్లేయరు కదూ!" అంటారు. అంచేత ముకుందరావు పూరకే తోచకుండా ఇంట్లో కూర్చోబెట్టడ మెందుకని, మదరాసులో లేడీస్ క్లబ్బులో చేర్పించాడు. మొదటి నాలుగు రోజులు బాగానే గడిచి పోయినై. పెందరాళే పనంతా పూర్తి చేసుకు, పిల్లలను తీసుకొని సరదాగా క్లబ్బుకెళ్లేది. టెన్నిసు కోర్టులో రాధతో సమంగా ఆ క్లబ్బులో ఒక్కళ్లైనా ఆడలేక పోయేవారు. ఇంక అయిదో రోజు నుంచీ ఆమెతో కబుర్లు మొదలెట్టేరు. ఆ క్లబ్బు (అధ్యక్షురాలు) ప్రసిడెంటు ధనికుల కుటుంబీకురాలు. వంటిమీద నగలు మోయలేనన్ని వున్నాయి. తిన్నగా నాలుగు ముక్కలైనా మాట్లాడలేదు. రెండువందల రూపాయలకు తక్కువ చీర యెప్పుడూ కట్టదు. ఇంక పోతే సెక్రటరీ ఒక పెద్ద సర్కారు ఉద్యోగస్తు భార్య. తిన్నగా ఓ అంటే న రాదు. ఎందుకూపొందని నవలలు మాత్రం అచ్చయినంతవరకు తెప్పించి యింట్లో పెట్టుకుంది. ఆ క్లబ్బులో మిగిలిన మెంబర్లకి చదవమనీ, అంత గొప్ప పుస్తకాలు యెక్కడా లేవనీ రికమెండు చేస్తూవుంటుంది.

"ఏమమ్మా! మీ ఆయన కేం పనీ?!! ఎక్కడ వుంటున్నారూ? జీతమెంత" అంది ఒకావిడ.

"టౌనులో ఏదో ఆఫీసులో (మరచి పోయానండి ఆ ఆఫీసు పేరు) గుమాస్తాగా వున్నారు. డెబ్భై రూపాయలండీ" అని రాధ అమాయకంగా చెప్పింది.

"మీ యింటికి అద్దెంతండీ? ఎన్ని గదులున్నాయి? మేడమీదా, కిందా!" అని ఇంకొకామె ప్రశ్న వేసింది.

"ప్రస్తుతం పన్నెండు రూపాయలిస్తున్నామండి రెండు గదులున్నాయి. కింద భాగమే. లైటుపట్టుకు లేదు."

"డెబ్భై రూపాయలు తెచ్చుకుంటూ అంతకంటే ఎక్కువేమి పెట్టగలవు లేయింటికి! అదేమిటమ్మా, పన్నెండు

రూపాయలకు యీ పూట్లో యిల్లుందా! పైగా లైట్లూ, మేడాకూడా నేం? ఇందుకే, ఆశ కంతులేదంటారమ్మాయ్." అంది మరో కావిడే, బుగ్గమీద వేలేసుకుని.

"పాపం! అందుకే మెళ్లో నల్లపూసలోకి తెల్లపూస లేదు" అని ఒకావిడే మరోకావిడే చెవిలో చెప్పి, అదోక మాదిరిగా రాధకేసి చూసింది. "ఎందు కమ్మాయ్! అంత కొద్ది జీతంలో ఈ క్లబ్బుకు నెలకు రూపాయి తగలెయ్యడం! మానెయ్యరాదూ! ఆకాస్తా ఏ ఖర్చుకైనా వస్తుంది" అని ఒకావిడే అనేసరికి...

"అదేమిటండీ! అల్లా మాట్లాడుతారూ? ఆశ అంటూ లేమిటీ? మేమెవరి సొమ్ముకూ ఆశపడ లేదే! 'కుండకు లేని దురద బచ్చల కెందుకూ?' మాకు లేని కష్టం మీ కెందు కండీ!" అని రాధ జవాబు చెప్పిందికాని ఆమె కళ్లకి నీళ్లొచ్చాయి. ఇంక అక్కడ ఒక క్షణంకూడా నిలవలేక పోయింది. ఆ వేళంతా యెంతో బాధ పడ్డది. భర్తకు మాత్రం చెప్పలేదు ఈ సంగతి. 'ఎందుకూ ఆయన మనస్సు కూడా నొప్పించటం' అనుకుని వూరుకుంది. ఆ తర్వాత రెండు రోజులకు ఆ క్లబ్బులోనే మెంబరైన పొరుగింటి వారమ్మాయి వచ్చి "ఏమండీ, రాధమ్మగారూ! క్లబ్బుకు రావడం లేదేం! మీరు వచ్చిన నాలుగు రోజులు ఎంత సరదాగా అనుకున్నాం" అంది.

జరిగిన కథంతా ఆ అమ్మాయితో చెప్పగా, "అదేమిటండీ వాళ్లల్లా అన్నారుకదా! అని మీరు మానెయ్యడ మేమిటి! క్లబ్బంటే వాళ్ల తాత సొమ్మా వాళ్లకు నగలుంటే వాళ్లేమోస్తారు యెద్దులాగ; మీ కేమైనా యిస్తారా? వాళ్లేదో అన్నారు కాదా అని, మీరు మానెయ్యడమేమిటండీ?, ఒక టంటే నాలుగెదురనాలిగా!" అని ఆ అమ్మాయి బలవంతం చేయగా రాధ మళ్లీ 'వీళ్లతో నేమిటిలే' అనుకుని క్లబ్బుకు రోజూ వెళ్లడమారంభించింది.

అల్లా కొన్ని రోజులయ్యాక ఈ ఆఫీసర్ల భార్యలందరూ 'రాధని' మీ రనడం మానేసి, 'నీవు' అని "ఏయ్ అమ్మాయ్!" అనీ పిలవడ మారంభించారు. పోని వయస్సులో వాళ్లకంటే చిన్నదే అనుకుందాం అయితేమటుకు అవమానంగా పిలవడ మెందుకో! ఆ యీడు వాళ్లనే ఆఫీసర్ల భార్యలైతే గౌరవంగా పిలవడం లేదూ? పోనీ యేమైనా ఎక్కువ కాలం నుంచీ పరిచయం చనువూ వుందా అంటే, అదీలేదు. మరి వాళ్ల ధోరణి కర్థమేమిటి?

అయినా రాధ విద్యావంతురాలు కనుక యిల్లాటి స్వల్ప విషయాల్లో అట్టే బాధపడేది కాదు. మరీ ఆ ఆఫీసర్ల భార్యలకు వుడుకుమోత్తనం యెక్కువౌతోంది, ఆ రోజు కారోజు. యింకా యిల్లా లాభంలేదనుకున్నారు. "ఏమిటీ! ఈ పిల్ల మనతో సమంగా క్లబ్బుకు రావడం, మనతో సమంగా మసలడమూనా? ఏమండోయ్! శెక్రటరీగారూ ఇల్లాటి చచ్చుపుచ్చు రకాల వాళ్లంతా మన గౌరవమైన క్లబ్బుకు రావడం నాకు యిష్టం లేదండోయ్. మా ఆయనా చూడబోతే పెద్ద హోదాలో వున్నారు, ఆ పిల్లమొగుడు మా ఆయన ఆఫీసులోనే గుమాస్తా. అతని భార్యతోను నే నాడేదీని, ఈ క్లబ్బులో మసిలేదీని నాఖర్మకాలి! ఈ క్లబ్బు మెంబరుషిప్పుకి రాజీనామా అయినా యిస్తానుగాని, రోడ్డుమీది వాళ్లందరితోటీ నేను ఆడనండోయ్" అంది ఒకావిడె! మిగిలిన మెంబర్లుకూడా, "మేమూ అంతే" అన్నారు. ఇంక రెండోరోజునుండి రాధకు ఆటల్లో జాగా లేకుండా చేసేశారు. ఒకవేళ ఒక మనిషి తక్కువైతే ఆ క్లబ్బు ప్యూన్ని తమతో ఆడేందుకు పిల్చేవారేగాని, రాధని మాత్రం పిల్చేవారుకాదు. పాపం! రాధ యేం చేస్తుంది. పైగా వాళ్లందరు క్లబ్బులో అడుగెట్టింది మొదలుకొని తన కేసి రుసరుస చూడ్డమాయె! ఇంకేం లాభం? పూర్తిగా క్లబ్బుకెళ్లడం మానేసింది.

రాధ మానేసిన రెండవనెలలో ఒకరోజున కారాగింది, రాధ యింటికెదురుగా! క్లబ్బు ప్రెసిడెంటుగారు పిచ్చమ్మగారూ, శెక్రటరీ వెంకమ్మగారూ మరి కొంతమందీ దిగారు. రాధ తనకోసరం కాదేమోనని, వాళ్లకోసర మెదురుచూడకుండా ఇంట్లో పనిచూసుకుంటోంది. ఇంతలో, "రాధమ్మగారూ! అన్నమాట వినిపించేసరికి గుమ్మంలో కొచ్చింది. ఆపళంగా అంతావచ్చి, ఎక్కడలేని ఆనందం చూపిస్తూ, రాధకి కరస్పర్శచేశారు. "ఏమండీ! ఏమిటీ? ఇల్లా

వచ్చారు! అంది రాధ. కూడా మనకుండానే అక్కడోక చాప ముక్కుంటే అంతా దానిమీద చతికిలబడ్డారు.

“రాధమ్మగారూ! మేము మిమ్మల్ని ఒకటికోరేందుకు వచ్చాం. మీరు ఇదివరకు జరిగినవేవీ జ్ఞాపకముంచుకోక, మా లోటుపాట్లను క్షమించి, వెంటనే తిరిగి మా క్లబ్బులో మెంబరుగా చేరాలి! వచ్చేవారం నెల్లూరినుంచి ఫేమస్ టీమ్‌వారు మన క్లబ్బుతో టెన్నిస్‌పోటీ ఆడేందుకు వస్తున్నారు. మన క్లబ్బులో బాగా ఆడేవారు ఎవరూలేరు. మీరొస్తేతప్ప లాభంలేద”ని అంటూ రాధని బతిమిలాడారు అంతేకాక రాధ పిల్లలని యెత్తుకుని, ముద్దులాడి, బిసకత్తులు అవీ యిచ్చారు. రాధ! ముందుకొంచెం ఆశ్చర్యపడింది. కాని వారినేమీ అనలేదు. “సరే లెండి, దానికేమిటీ,” నేనుమటుకూ మహా ఆడగలనేమిటి? మీరంతా యివ్వాళ్లి మా యింటికొచ్చినందుకు చాలా సంతోషంగావుంది” అని బొట్టూ తాంబూలం యిచ్చి గౌరవించి పంపింది.

రాత్రి ముకుందరావు వచ్చాక సంతోషంతో జరిగినదంతా చెప్పింది. ముకుందరావు తనలో నవ్వుకుని, రాధని తప్పకుండా క్లబ్బుకు రోజూ వెళ్లమన్నాడు.

* * *

మర్నాడు పొద్దుటే రాధ స్నేహితురాలైన కమల రాధ యింటికి చూడ్డానికివచ్చి మాటల సందర్భాన్ని “అన్నట్టు మన క్లబ్బువారెవరేనా మీయింటికి వచ్చారా నిన్నగాని, మొన్నగాని?” అని అడిగింది.

“మరే, నిన్ననే వచ్చారు కమలా! శెక్రటరీగారూ, ప్రసిడెంటు పిచ్చమ్మగారూ, ఇంకా యెవరో ఒకావిడ వచ్చారు......అవునుగానీ, ఏమిటీ! వాళ్లు రాక నాకు చాలా ఆశ్చర్యంగావుంది! వాళ్లలో ఈ పరివర్తనం రావడానికి కారణం ఏమిటంటావ్?” అంది రాధ.

“ఏమిటంటారా! చెప్తా వినండి! మిమ్మల్ని ఆవిధంగా తూలనాడేక మీరు మా నేరాయకదా! ఆ తర్వాత బెజవాడ నుండి ఒక టీము వచ్చింది వీళ్లతో పోటీఆటకి. వాళ్లతో ఆడి శుభ్రంగా వోడిపోయారు. అప్పటినుండి వాళ్లల్లో వాళ్లకి అభిప్రాయభేదాలు ఏర్పడ్డాయి. కేవలం ధనమే ప్రధానమా, లేక మనిషియొక్క మంచితనమూ, విజ్ఞానమూ ప్రధానమా అని ఈ విషయం పైని జరిగిన చర్చలో చాలా మంది పాల్గొన్నారు. ఒక్క ధనలోపం కొంచ మున్నంత మాత్రాన ఒక వ్యక్తికి సంఘంలో గౌరవానికే మాత్రం లోపంగా పరిగణింపకూడదన్నారు ఒకపక్షంవారు. ‘ప్రస్తుత భారతదేశ చరిత్రలో ఏవిధమైన మార్పులొస్తున్నాయ్! హరిజనులను సమంగా సోదరులవలె చూడవలసిన బాధ్యత ప్రతి భారతీయుడిదన్నీ అని గాంధి మహాత్ముడు యెలుగెత్తి ఘోషించుట లేదూ! అందరూ కలిసిమెలిసి ఏకకుటుంబము వలె ఐకమత్యముతో వుండవలెనని బోధించడంలేదూ? ఈ పరిస్థితులలో ధనవంతులైనవారు గర్వించి తమకంటే ధన హీనులను తూలనాడుట కేవలం వారి అజ్ఞానాన్ని తెలుపుతుందిగదా!’ అంటూ ఈ ధోరణిలో నేనూ, నాతోపాటు ఇంకా నలుగురం మాట్లాడాము. ఈ చర్చకు ఫలితంగా “ఇకమీద ఎవరైనా సరే నెలచందా చెల్లించి క్లబ్బులో చేరితే వారిని మిగిలిన అందరిలాగే, ధనమున్నా, లేకపోయినా, నగలున్నా లేకపోయినా, సమంగా గౌరవించాలి. ఇదేగాకుండా ఈ మధ్య మన ప్రవర్తన మూలాన క్లబ్బుకురావడం మానేసిన శ్రీమతి రాధమ్మగారిని క్షమార్పణ గోరి, ఆమెని తిరిగి క్లబ్బులోచేరమని కోరవలెనూ’ అని తీర్మానంగూడా చేశాం. దాని పరిణామమే నిన్న వారు మీ యింటికి రావడం. అదల్లావుండగా వచ్చేవారం నెల్లూరు క్లబ్బువాళ్లు మనక్లబ్బుతో ఆడేందుకు వస్తున్నారు. అప్పుడు మీరుంటే బాగుంటుందనికూడా అనుకున్నారు.”

“సరేగాని కమలా ముందు నా కృతజ్ఞతాభివందనాలు నీకు చెప్పనియ్యి” అంది రాధ.